సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



మండే కాలం..

అగ్నిప్రమాదాలు సంభవించకుండా అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నారు. 8లో



పోస్టుకు రూ.లక్ష?

సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు పోస్టుల నియామకాల్లో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రియాంక

భద్రాచలం: శ్రీరామనవమి ఉత్సవాలకు వచ్చే భక్తులు స్వామివారిని ప్రశాంతంగా దర్శించుకునేలా కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శనివారం ఉదయం భద్రాచలం వచ్చిన ఆమె దేవస్థానం, మిథిలా స్టేడియం చుట్టుపక్కల ఏర్పాట్లను పరిశీలించారు. స్టేడియంలో సెక్టార్లను పరిశీలించి సలహాలు, సూచనలను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో భక్తులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, సెక్టార్లలో కూలర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్లు ఉంటాయని పేర్కొన్నారు. 120 తలంబ్రాల పంపిణీ, 60 ప్రసాదాల కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రూట్ మ్యాప్‌లు, అందజేస్తున్న సౌకర్యాలు, కేంద్రాల వివరాలను భక్తులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రామాలయ ఈఓ రమాదేవి, ఈఈ రవీందర్, ఆర్‌డీఓ దామోదర్ రావు, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామభక్తుల పాదయాత్ర



మజ్జిగ అందిస్తున్న ఆర్యవైశ్య సంఘం బాధ్యులు

అశ్వారావుపేటరూరల్: శ్రీరామనవమి నేపథ్యంలో రామభక్తులు భద్రాచలం రామాలయానికి పాదయాత్రగా తరలివెళ్తున్నారు. ఏపీలోని ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల భక్తులు కాలినడకన భద్రగిరికి బయల్దేరగా, శనివారం అశ్వారావుపేట చేరుకున్నారు. మండలంలోని ఊట్లపల్లి సమీపంలో ఉన్న శ్రీఆంజనేయస్వామి విగ్రహం ఆవరణలో భక్తులకు రామదండు సేవా సమితి, వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో సుమారు 3 వేల మందికి అన్నదానం మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లను వితరణ చేశారు. వినాయకపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. జల్లిపల్లి దేవరాజ్, జల్లిపల్లి లోకనాథ్, శీమకుర్తి సుబ్బారావు, సుగ్గల పరమేశ్వరరావు, జల్లిపల్లి రాజా, తోకల సురేష్, చిట్టూరి హరి, యశోధ యుగంధర్, రోహిణి, సతీష్, సత్యనారాయణ, వెంకన్నబాబు, అంబి, మణికంఠ పాల్గొన్నారు.

చకచకా రామయ్య పెళ్లి పనులు

- శరవేగంగా లడ్డూలు, ముత్యాల తలంబ్రాల తయారీ
- నేడు గరుడ ధ్వజపటలేఖనం, గరుడధ్వజాధివాసం
- కలెక్టరేట్‌లో వీవీఐపీ, వీఐపీ టికెట్ల విక్రయం



తలంబ్రాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్న భక్తులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామనవమి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో శ్రీ సీతారాముల కల్యాణం, మరుసటి రోజు పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటికే భద్రాచలంలో మూడు దిక్కుల, సారపాక, మోరంపల్లి బంజర్‌తో పాటు పలు గ్రామాల్లో భక్తులకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. కల్యాణం జరగనున్న మిథిలా స్టేడియం, వైకుంఠ ద్వారం, దేవస్థానాలను పంచ రంగులతో తీర్చిదిద్దారు. వీవీఐపీ, వీఐపీ, ఉభయ దాతలు, ఇతర సెక్టార్లలో చలువ పందిళ్ల నిర్మాణం పూర్తికాగా, చాందినీ వస్త్రాలతో అలంకరిస్తున్నారు. దేవస్థానంతోపాటు పట్టణంలో పలు చోట్ల విద్యుత్ దీపాలతో అలంకరణ చేపట్టారు. ఏర్పాట్లపై కలెక్టర్ ప్రియాంక ప్రత్యేక దృష్టి సారించడంతో వివిధ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు.

2.5 లక్షల లడ్డూలు

శ్రీరామనవమి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం దేవస్థానం అధ్వర్యంలో లడ్డూల తయారీ ప్రారంభమైంది. తానీషా కల్యాణ మండపంలోని పైభాగంలో లడ్డూల తయారీ చేపట్టారు. గతేడాది రెండు లక్షల లడ్డూలను తయారు చేయగా, ఈ ఏడాది భక్తుల రాక పెరిగే అవకాశం ఉందని భావిస్తున్న నేపథ్యంలో రెండున్నర లక్షల లడ్డూలను తయారీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు తగినట్లుగానే పంపిణీకి సైతం కౌంటర్లను పెంచనున్నారు.



స్వామివారికి సార్వభౌమసేవ జరుపుతున్న అర్చకులు, భక్తులు

నేడు గరుడ ధ్వజపటలేఖనం, గరుడధ్వజాధివాసం

వసంత ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి సార్వభౌమ వాహన సేవ జరిగింది. యాగశాలలో మండల, కుండ, కలశ తదితర క్రతువులు నిర్వహించారు. ఇక ఆదివారం గరుడ ధ్వజపట లేఖనం, గరుడధ్వజాపటావిష్కరణ, గరుడధ్వజాధివాసం తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు, పండితులు నిర్వహించనున్నారు.



లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది

3.5 లక్షల తలంబ్రాల ప్యాకెట్లు

సీఆర్‌ఓ వెనుక భాగంలో ఉన్న టీటీడీ సత్రంలో ముత్యాల తలంబ్రాల తయారీ ప్రారంభించారు. గతేడాది రెండున్నర లక్షల ప్యాకెట్లు సిద్ధం చేయగా, డిమాండ్‌ను బట్టి ఈసారి మూడు నుంచి మూడున్నర లక్షల ప్యాకెట్లను సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు. భక్తులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు కలిపిన తలంబ్రాలను మిషనరీ సహాయంతో ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. గతేడాది తిరుపతికి చెందిన ఓ దాత రూ.1.40 లక్షల వ్యయంతో అందచేసిన మిషన్‌తో గంటకు 1,500 ప్యాకెట్ల చొప్పున ప్యాకింగ్ చేస్తున్నారు. దీంతో రోజుకు 25 వేల వరకు తలంబ్రాల ప్యాకెట్లు భక్తుల కోసం అందుబాటులోకి వస్తున్నాయి. గతేడాది లాగే రెండు ముత్యాలతో ఉన్న తలంబ్రాల ప్యాకెట్ రూ. 30కే భక్తులకు, పోస్టల్ శాఖకు విక్రయించనున్నారు. ఆర్టీసీ మాత్రం గతేడాది కంటే ధరను పెంచి రూ.151 వసూలు చేస్తుండటంతో, ఆర్టీసీకి ప్యాకెట్ రూ. 50కు విక్రయించనున్నట్లు తెలుస్తోంది.

వీవీఐపీ, వీఐపీ టికెట్ల అమ్మకం కలెక్టరేట్‌లో..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ ఏడాది సీఎంతో పాటు ఇతర మంత్రులు నవమికి వచ్చే అవకాశం లేకపోవడంతో, సీఎం సెక్టార్‌ను వీవీఐపీ, వాటి వెనుక వీఐపీ సెక్టార్లుగా విభజించారు. ఇందులో వీవీఐపీలో సెక్టార్‌లో ఒక్కొక్కరు రూ. 10 వేల టికెట్‌తో 100 మంది, వీఐపీ సెక్టార్‌లో ఒక్కొక్కరు రూ. 5 వేల టికెట్‌తో 250 మంది వీక్షించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచకపోవడంతో, పలువురు సీఆర్‌ఓ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. చివరకు కలెక్టరేట్‌లో వీటిని విక్రయించనున్నట్లు అధికారులు తాజాగా ప్రకటించారు.

పెద్దమ్మతల్లికి శ్రీచక్రార్చన పూజలు



శ్రీచక్రార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

పాల్వంచరూరల్: శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాల్లో ఐదో రోజు శనివారం పెద్దమ్మతల్లికి అర్చకులు శ్రీచక్రార్చన, ఆంజనేయస్వామికి ఆకు పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో నాదనీరాజనం, సూర్యనమస్కారాలు, సూక్తపారాయణం, చండీసప్తసతీ పారాయణం, హోమాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష కుంకుమార్చన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం తదితర పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఈఓ సుదర్శన్, భక్తులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో రెండు పతకాలు



సర్టిఫికెట్ అందుకుంటున్న జల్లా రవీందర్

మణుగూరు టౌన్: సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం హెల్తీ సీనియర్ సిటీజన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ (హెచ్ ఎస్‌సీఎస్‌ఏ) ఆధ్వర్యంలో మాస్టర్ అథ్లెటిక్స్ నిర్వహించారు. మణుగూరు మండలం కూనవరం పంచాయతీకి చెందిన జల్లా రవీందర్ 60+ విభాగంలో లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్ విభాగాల్లో వెండి పతకాలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌ను పలువురు అభినందించారు.

అభ్యర్థి ఎవరైనా గెలిపించాలి

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కొత్తగూడెంరూరల్: ఖమ్మం ఎంపీ అభ్యర్థి ఎవరైనా పార్టీకి ఆదేశాల అనుగుణంగా కష్టపడి పని చేసి గెలిపించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కొత్తగూడెం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలకు 29 రోజుల సమయం ఉందని, రాబోయే రెండు రోజుల్లో అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీకి రెండు పర్యాయాలు ప్రధానమంత్రిగా అవకాశం వచ్చినా దేశం బాగు కోరి తృణప్రాయంగా త్యజించారని పేర్కొన్నారు. ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా కొత్తగూడెం ఎమ్మెల్యేగా సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును 26 వేల మెజారిటీతో గెలిపించుకున్నామని అన్నారు. 110 రోజుల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ కుళ్లు కుతంత్రాలతో వ్యవహరించారని, గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ పెద్దలు మిషన్ భగీరథ పేరుతో రూ.46,000 కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఇంటింటికి తాగునీరు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, టీపీసీసీ సభ్యుడు నాగసీతారాములు , కొత్వాల శ్రీనివాసరావు, తుళ్లూరి బ్రహ్మయ్య, తూము చౌదరి, ఆళ్ల మురళి, చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ చేజారకుండా..

ఖమ్మం లోక్‌సభ స్థానంపై బీఆర్‌ఎస్ నజర్



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: సిట్టింగ్ స్థానమైన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపు కోసం బీఆర్‌ఎస్ సర్వశక్తులొడ్డుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయాన్ని మర్చిపోయి.. లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తమయ్యేలా కేడర్‌కు నాయకత్వం దిశానిర్దేశం చేస్తోంది. అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ నామ నాగేశ్వరరావును ప్రకటించిన పార్టీ అధినేత కేసీఆర్.. ఆయన గెలుపు బాధ్యతలను జిల్లా నాయకత్వానికి అప్పగించారు. దీంతో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాల నిర్వహణలో నిమగ్నమయ్యారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతీసారి నిరాశే

తెలంగాణ ఏర్పడ్డాక మూడు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు నిరాశే ఎదురవుతోంది. 2014 ఎన్నికల్లో పది స్థానాలకు గాను కొత్తగూడెంలో జలగం వెంకట్రావు మాత్రమే గెలిచారు. 2018లో ఖమ్మం నుంచి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గెలవగా.. ఇటీవల ఎన్నికల్లో భద్రాచలంలో తెల్లం వెంకట్రావు గెలిచినా ఆయన సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటిన బీఆర్‌ఎస్, అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ప్రభావం చూపలేకపోయింది. అయితే 2014, 2019 ఎన్నికల్లో జిల్లాలో ఫలితాలు నిరాశపరిచినా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీపరంగా నష్టం జరగలేదు.

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా

అసెంబ్లీ ఎన్నికల్లో కుదేలైన బీఆర్‌ఎస్.. లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి ఓట్లు కొల్లగొట్టింది. 2014లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి జరగడంతో రెండింటిలోనూ బీఆర్‌ఎస్ అపజయం మూటగట్టుకుంది. ఇక 2018లో అసెంబ్లీ ఎన్నికలు జరగగా, ఉమ్మడి జిల్లాలో ఒకే సీటుకు పరిమితమైంది. ఆ తర్వాత 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు.. కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరిపై విజయం సాధించారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ బలం పుంజుకుంది. ఈసారి కూడా వేర్వేరుగా ఎన్నికలు జరుగుతుండడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధిస్తారని ఆ పార్టీ నేతలు నమ్మకంగా ఉన్నారు.

ఏకతాటిపైకి..

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయం కోసం ఆ పార్టీ నేతలు ఏకమయ్యారు. లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ కేడర్‌తో మమేకమవుతున్నారు. అభ్యర్థి నామాతో పాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విస్తృతంగా పర్యటిస్తూ కేడర్‌లో స్థైర్యాన్ని నింపేలా సన్నాహక భేటీలను ఉపయోగించుకుంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో త్వరలోనే బహిరంగ సభ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

ప్రస్తుతం భిన్న పరిస్థితులు..

గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత రెండు ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో పరాజయం పాలైనా.. రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో బీఆర్‌ఎస్‌లోకి వలసలు కొనసాగాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ఎదురులేకుండా పోయింది. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. ఏ క్షణంలో ఎవరు బీఆర్‌ఎస్‌ను వీడతారో తెలియకుండా ఉంది. ఉమ్మడి జిల్లాలో భద్రాచలం నుంచి మాత్రమే బీఆర్‌ఎస్‌కు విజయం దక్కగా.. ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరడంతో ఇప్పుడు ఒక్క ఎమ్మెల్యే కూడా లేకుండా పోయారు. ఈ నేపథ్యాన నామ విజయం సాధించడాన్ని బీఆర్‌ఎస్ తప్పనిసరిగా భావిస్తోంది.

శ్రీరామస్తోత్రం పుస్తకాలు పంపిణీ

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి ఏపీలోని రాజమండ్రికి చెందిన పురాణమండ శ్రీనివాస్ 30 వేల శ్రీరామస్తోత్రం పుస్తకాలను వితరణ చేశారు. ఆ పుస్తకాలను శనివారం ఈఓ రమాదేవి భక్తులకు పంపిణీ చేశారు. తొలి పుస్తకాన్ని స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులకు అందజేయగా, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. శ్రీసీతారాముల కల్యాణోత్సవ ముత్యాల తలంబ్రాలను ఆర్టీసీ కార్గో, పోస్టల్ శాఖతోపాటు దేవస్థానం కౌంటర్లు, ఆన్‌లైన్‌లలో మాత్రమే విక్రయించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. నకిలీ లడ్డూలు, తలంబ్రాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయం చుట్టుపక్కల దుకాణాలు, తోపుడు బండ్లపై అమ్మే పులిహోర, ఇతర ప్రసాదం కొనుగోలు చేయొద్దని సూచించారు.

నత్తేనయం..

- మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం
- రూ.10 కోట్లతో పాల్వంచ చింతల చెరువు ఆధునికీకరణ
- ఆరు నెలలు గడిచినా కొలిక్కిరాని నిర్మాణ పనులు





సాగుతున్న చింతలచెరువు కట్ట రోడ్డు విస్తరణ పనులు (ఇన్‌సెట్) మెయిన్ రోడ్డు పక్కన చెరువును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

పాల్వంచ: తెలంగాణ ఏర్పడ్డాక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోను చెరువులను ట్యాంక్ బండ్‌లుగా తీర్చిదిద్దుతున్నారు. జిల్లాలో పలుచోట్ల ట్యాంక్ బండ్‌లు మంజూరు కాగా, పనులు పూర్తయ్యాయి. పాల్వంచలో మాత్రం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇల్లెందులో రూ.4.53 కోట్లతో ఇల్లెందుపాడు చెరువు, కొత్తగూడెంలో రూ.2.50కోట్లతో చుంచుపల్లి చింతల చెరువు, అశ్వారావుపేటలో రూ.5.80 కోట్లతో వెంకమ్మచెరువు, పినపాకలో రూ.2.23 కోట్లతో నాయుడుపేట చెరువులను మినీ ట్యాంక్ బండ్‌లుగా ఆధునికీకరించి, ప్రారంభించారు. పాత పాల్వంచ చింతల చెరువు పనుల ప్రతిపాదనల్లోనే జాప్యం జరిగింది. ఎట్టకేలకు గతేడాది అక్టోబర్ 6న రూ.10 కోట్ల నిధులతో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, వేసవి కాలంలో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇంకా చెరువుపై 15 మీటర్ల రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. చెరువు మట్టి పూడిక తీసి కట్టపై రోడ్డు ఎత్తు పెంచుతున్నారు.

కార్పొరేషన్ అయితే..

కొత్తగూడెం నియోజకవర్గంలోని కొత్తగూడెం, పాల్వంచ జంటపట్టణాలను కలిపి కార్పొరేషన్‌గా తీర్చిదిద్దాలనే యోచనలో ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఈ రెండు పట్టణాల మధ్య ఇప్పటికే కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రెండు పట్టణాలను కలిపే హైవే పక్కనే చింతల చెరువు ఉంది. చెరువును అభివృద్ధి చేస్తే ఇదే ప్రధాన ఆకర్షణగా నిలువనుంది. అధికారులు చొరవ చూపాలని పలువురు పేర్కొంటున్నారు.

కబ్జాపై చర్యలేవి?

చింతలచెరువు మొత్తం 95 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చెరువు ఆధారంగా సుమారు 350 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. పాల్వంచ, పాత పాల్వంచ రెండింటి మధ్యలో ఉండటంతో ఇక్కడి భూములు అధిక ధరలు పలుకుతున్నాయి. దీంతో అక్రమార్కులు మెయిన్ రోడ్ వైపు చెరువు కబ్జాకు పాల్పడి బహుళ అంతస్తు నిర్మాణాలు చేపట్టారు. ఇందులో 35 గృహాలకు అధికారులు పలుమార్లు నోటీసులు కూడా జారీ చేశారు. మెయిన్ రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద పలువురు ఆక్రమణకు యత్నిస్తున్నారు. చెరువు వెనుక భాగంలో ఇప్పటికే పలువురు కబ్జాకు పాల్పడ్డారు.

మారనున్న రూపురేఖలు

చెరువు కట్టపై 15 మీటర్ల మేర రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. 1,150 మీటర్ల బీటీ నిర్మాణం జరగనుంది. చెరువు దిగువ భాగంలో రాతితో పటిష్టం చేయాల్సి ఉంది. బతుకమ్మ ఘాట్, సెంట్రల్ లైటింగ్, వాకింగ్ ట్రాక్, పాత పాల్వంచ, గొల్లగూడెం రెండు వైపులా స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయనున్నారు. పచ్చదనం ఉట్టిపడేలా రకరకాల క్రోటాన్ మొక్కలు, సందర్శకులు కూర్చునేలా బల్లలు, పిల్లలు ఆడుకునేందుకు పార్క్ ఏర్పాటు చేయనున్నారు.

హైవే పక్కన.. పార్కింగ్ ప్రధానం

చింతల చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చుతున్న క్రమంలో రెండు పట్టణాల ప్రజలకు ఆహ్లాదకరంగా మారనుంది. జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో పాల్వంచ, కొత్తగూడెం ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల వారు కూడా సందర్శనకు వచ్చే అవకాశం ఉంది. సందర్శకుల సంఖ్య పెరిగితే పార్కింగ్ సమస్య తలెత్తుతుంది. రోడ్డు పక్కన పార్కింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడే హైవే నుంచి చెరువుకు వెళ్లే వద్ద, రెండో వైపు గొల్లగూడెంలో మరో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా ఉంటుంది. ఇందుకోసం అధికారులు చొరవ చూపాల్సిఉంది.

యుద్ధప్రాతిపదికన పనులు..

చెరువు నీటిని దిగువకు పంపించేందుకు కొంత ఆలస్యమైంది. దిగువన రైతుల పంటలు ఉన్నందున వారి కోరిక మేరకు కొన్ని రోజులు ఆగాల్సి వచ్చింది. పనులు ఆరు నెలలు ఆలస్యమయ్యాయి. ఇప్పుడు పనులు యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నాం. వేసవి చివరి నాటికి పూర్తయ్యేలా చూస్తాం.

–మంగూ, ఇరిగేషన్ ఏఈ

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో 'సింగరేణి' ఆర్వో ప్లాంట్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియా పరిధిలోని కిష్టారం, జేవీఆర్ ఓసీకి పది కిలోమీటర్ల దూరాన ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటుచేయనుంది. ఈ విషయమై సంస్థ తరఫున వారం రోజులుగా సర్వే చేస్తున్నారు. రెండు ఓసీల పరిధిలో సుమారు 50 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటుచేయనుండగా, ఒక్కో ప్లాంట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు వెచ్చించనున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఒక గది నిర్మించి, బోర్ వేయించడంతో పాటు అవసరమైన చోట ఓవర్‌హెడ్ ట్యాంక్ లేదా మినీ ట్యాంకుల నిర్మించనున్నట్లు సమాచారం. గతంలో సీఎస్సార్ పాలసీలో భాగంగా రుద్రంపూర్, గౌతంపూర్, మేషన్‌కాలనీ, రామవరం, 3 ఇంక్‌లైన్, అయ్యవారిపేట తదితర ప్రాంతాల్లో 15 ప్లాంట్లను వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేశారు.

ప్యాసింజర్ రైలు పునరుద్ధరణ

కారేపల్లి: విజయవాడ–భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం), భద్రాచలం రోడ్డు–విజయవాడ మధ్య ప్యాసింజర్ రైలును దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం పునఃప్రారంభించారు. ఈ రైలును 21వ తేదీ వరకు నడిపిస్తామని ప్రకటించారు. విజయవాడలో మొదలుకానున్న ప్యాసింజర్ రైలు ఖమ్మం, డోర్నకల్, కారేపల్లి మీదుగా కొత్తగూడెం(భద్రాచలం రోడ్డు) వరకు నడుస్తుంది. తిరిగి కొత్తగూడెంలో మొదలై ఇదే మార్గం ద్వారా విజయవాడ చేరుకుంటుంది.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

అశ్వారావుపేటరూరల్: చికిత్స పొందుతున్న వివాహిత మృతిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రామన్నపాలెం కాలనీకి చెందిన బొంతి అనూష(28)కు ఖమ్మం జిల్లా మధిర మండలం ఇల్లూరి గ్రామానికి చెందిన నాగరాజుతో పదేళ్ల క్రితం వివాహమైంది. భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తూ, మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండటంతో అనూష సుమారు రెండేళ్ల నుంచి తల్లి వద్దే ఉంటోంది. ఈ క్రమంలోనే ఆర్థికభారంతో మనస్తాపానికి గురై ఈ నెల 9వ తేదీన మండలంలోని అల్లిగూడెంలోని ఓ పామాయిల్ తోటలో కూలి పనులకు వెళ్లి పురుగుల మందు తాగింది. ఆస్పత్రికి తరలించిన చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి ఈ నెల 11వ తేదీన మృతి చెందింది. శనివారం మృతురాలి తల్లి రాణి చేసి ఫిర్యాదు చేయగా, నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

పాల్వంచ: బైక్ డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఉల్వనూరు పంచాయతీ లక్ష్మీదేవిపల్లికి చెందిన సపావత్ భీంజీ రెండో కుమారుడు నరేశ్(21) ఈ నెల 12న తన ఇద్దరు స్నేహితులను మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని పట్టణంలోని నటరాజ్ సెంటర్ వద్ద దింపాడు. అనంతరం పని ఉందని అంబేద్కర్ సెంటర్ వైపు వెళుతూ యాక్సిస్ బ్యాంక్ సమీపంలో డివైడర్‌ను ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: భూ వివాదంలో దాడికి పాల్పడిన వ్యక్తులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ యాకుబ్ అలీ కథనం ప్రకారం.. మండలంలోని కొత్త నారంవారిగూడేనికి చెందిన గోపిన నారాయణ, అతని కుమారుడు రామకృష్ణ కలిసి వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమిలో శనివారం సాగు పనులు చేస్తున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన, వారి బంధువులు గోపిని బుచ్చిరాజు, పుల్లారావు, శ్రీను, రవి కలిసి పొలం వద్దకు వచ్చి భూమి తమదేనని గొడవ పడ్డారు. ఈ క్రమంలోనే నారాయణ, రామకృష్ణలపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. బాధితుడు నారాయణ ఫిర్యాదు చేయగా, దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

దమ్మపేట : ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొని డ్రైవర్, క్లీనర్‌కు గాయాలైన సంఘటన మండల పరిధిలోని గట్టుగూడెం గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...శనివారం తెల్లవారుజామున సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపు లారీ మరమ్మతులకు గురికాగా గట్టుగూడెం గ్రామ శివారులో నిలిపారు. డ్రైవర్, క్లీనర్, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఎస్‌కే.మస్తాన్‌వలీ, పుల్లుట్ల శ్రీనివాస్‌లు మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేట వైపు వెళ్తున్న మరో లారీ, ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

8 కిలోల గంజాయి సీజ్

భద్రాచలం (భద్రాచలం అర్బన్): పట్టణంలో శనివారం పోలీసులు 8 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మండే కాలం..

ఎండాకాలం కావడంతో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లాలో ఆరు ఫైర్ స్టేషన్లు ఉండగా, వాటిలో ఆరు ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉన్నాయి. అగ్ని ప్రమాద సమాచారం అందగానే అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపడతారు. కాగా ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు అగ్నిమాపకశాఖ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కొత్తగూడెం ఫైర్ స్టేషన్ అధికారి గుండా పుల్లయ్య తెలిపారు. – కొత్తగూడెంటౌన్

- అగ్నితో జాగ్రత్తగా ఉంటే మేలు
- జిల్లాలో ఆరు ఫైర్ స్టేషన్ల ద్వారా సేవలు
- ప్రమాదం జరిగితే 101కు సమాచారం ఇవ్వాలి

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



కొత్తగూడెం ఫైర్ స్టేషన్

■ డయల్ 101

ఇళ్లు, సినిమా హాల్స్, షాపింగ్ మాల్స్, జనసంచార ప్రదేశాలు, అటవీప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని ఫైర్ అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ ప్రమాదం జరిగితే తక్షణమే 101కు ఫోన్ చేసి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

■ అగ్నిమాపక సిబ్బందికి నివాళి

1944 ఏప్రిల్ 14న ముంబై విక్టోరియా డాక్ యార్డ్‌లో నౌకలో అగ్ని ప్రమాదం సంభవించగా, విధి నిర్వహణలో ఉన్న 66 మంది అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో వారి జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఏప్రిల్ 14 తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. కర్తవ్య నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన సిబ్బందికి నివాళులర్పించడంతోపాటు ప్రమాదాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపడతున్నారు.

■ ఇళ్లలో ప్రమాద నివారణ చర్యలు..

అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు, మండే పదార్థాలను చిన్న పిల్లలకు అందుబాటులో ఉంచొద్దు. కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా పడవేయొద్దు. పాడైన వైర్లను వినియోగించొద్దు. ఇంట్లో ఎల్లవేళలా నీటిని నిల్వ ఉంచాలి. వంటగదిలో వెలుతురు ఉండేలా చూడాలి. మండుతున్న స్టౌవ్‌లో కిరోసిన్ పోయకూడదు. వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచొద్దు. అగ్ని ప్రమాదంలో దుస్తులకు నిప్పంటుకుంటే పరిగెత్తొద్దు. నేలపై దొర్లాలి. లేదంటే దుప్పటిని కప్పుకోవాలి. కాలిన శరీరంపై నీళ్లు చల్లొద్దు. పొగతో నిండిన గదులలో మోకాళ్లపై పాకొద్దు. ముక్కుకు, నోటికి అడ్డంగా తడి గుడ్డను కట్టుకుని గాలిని పీల్చడం ద్వారా కార్బన్ డైయాక్సైడ్‌ను పీల్చకుండా ఉండవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో గడ్డి వాములు నివాస గృహాలకు 60 అడుగుల దూరంలో, గుడిసెకు గుడిసెకు మధ్య 30 అడుగుల దూరం ఉండేలా చూడాలి.

■ రద్దీ ప్రదేశాలు, కర్మాగారాల్లో

పాఠశాలలు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్‌లో ఆర్‌సీసీ లేదా కాంక్రీట్‌ను మాత్రమే పైకప్పుగా వాడాలి. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అందుబాటులో ఉంచాలి. సెల్లార్‌లో ఆటోమేటిక్ స్ప్రింక్లర్లను ఉంచాలి. కర్మాగారాల్లో ఉద్యోగులందరికీ అగ్ని ఉనికి ప్రదేశాలను తెలపాలి. బేసిక్ ఫైర్ ఫైటింగ్‌లో శిక్షణ ఇవ్వాలి. మిషనరీ బెల్టులు, పుల్లీలు, విద్యుత్ పరికరాల నుంచి అగ్గిరవ్వలు రాలకుండా జాగ్రత్తలు పాటించాలి. గోదాములు, గిడ్డంగులలో చెక్క స్లీపర్లపైనే నిల్వలను ఉంచాలి. అగ్ని నిరోధక స్వభావం కలిగిన వస్తువులతోనే పందిర్లు వేయాలి. పందిర్ల చుట్టు కనీసం 4.5 మీటర్ల స్థలం ఖాళీగా ఉంచాలి. ఎలక్ట్రికల్ వైర్లకు, పెండాల్పులకు కనీసం 2.5 మీటర్ల దూరం ఉండాలి.

■ ఏడాదిలో రూ.1.34 కోట్ల నష్టం

జిల్లాలో 2023 ఏప్రిల్ నెల నుంచి 2024 మార్చి వరకు పలు ప్రమాదాలు జరగ్గా, రూ.1,34,71,000 విలువైన ఆస్తి నష్టం వాటిల్లింది. ఇక అగ్ని ప్రమాదాల నుంచి రూ.5,42,30,000 విలువైన ఆస్తులను అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. అన్నపురెడ్డిపల్లి, పాల్వంచ తదితర ప్రాంతాల్లో ప్రమాదాల్లో ఇరుక్కున్న పశువులను, జంతువులను రక్షించారు. ప్రమాదాల్లో మృతి చెందిన ఆరుగురి మృతదేహాలను గుర్తించి వెలికితీసినట్లు అధికారులు తెలిపారు.

45 మంది అగ్నిమాపక సిబ్బంది

జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేటల పరిధిలో ఆరు ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో మణుగూరులో ఫైర్ ఔట్ పోస్టు స్టేషన్ ఉంది. ఆయా స్టేషన్ల పరిధిలో అధికారులు, లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ఫైర్‌మెన్‌లు మొత్తం 45 మంది వరకు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే 101కు ఫోన్ చేయాలి. కొత్తగూడెం ఫైర్ స్టేషన్ ఆఫీస్ 99637 52656, భద్రాచలం 99637 52657, ఇల్లెందు ఫైర్ స్టేషన్‌కు 99637 48085 ద్వారా సమాచారం అందించాలి. అగ్ని ప్రమాదాలు జరగకుండా, జరిగినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తాం. మంటలను ఆర్పే విధానం వివరిస్తాం.

– గుండా మల్లేష్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్, కొత్తగూడెం

పోస్టుకు రూ.లక్ష?

- ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకంలో దందా
- అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారని అభ్యర్థుల ఆవేదన
- సింగరేణి మణుగూరు ఏరియాలో అవినీతి ఆరోపణలు



ఫిట్‌నెట్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు పోస్టులను అనర్హులకు కట్టబెట్టారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని అర్హులు పేర్కొంటున్నారు. పరుగుపందెం, తదితర ఫిట్‌నెస్ టెస్టుల్లో అర్హత సాధించిన వారిని, భూనిర్వాసితులను పక్కన పెట్టి రూ.లక్ష ముడుపులు ఇచ్చినవారినే నియమించారంటూ ఆరోపణలు వస్తున్నాయి. టెస్ట్‌లకు హాజరుకానీ, స్థానికేతరులకు ఉద్యోగాలు ఇవ్వడం ఇందుకు బలం చేకూర్చుతున్నాయి. 15 మంది అవసరం ఉండగా, 35 మందిని తీసుకోవడం కూడా విమర్శలకు తావిస్తోంది.

లోపించిన పారదర్శకత

ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల కాంట్రాక్ట్‌ను హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ దక్కించుకుంది. 15 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి, ఈ నెల పరుగు పందెంతో పాటు ఇతర అర్హత పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ ఆధారంగా 35మందిని ఎంపిక చేశారు. కాగా మొదటి విడతగా 18 మంది ఉద్యోగంలో చేర్చుకున్నారు. వారిలో కొందరు అర్హత సాధించనివారు ఉన్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తామంతా 50 రోజులుగా పిలుపు కోసం వేచి చూస్తున్నామని వాపోతున్నారు. ఒక్కో పోస్టును రూ.లక్ష నుంచి రూ. లక్షా 20వేలకు అమ్ముకుంటున్నారని మణుగూరులోని నిరుద్యోగులు సింగరేణి విజిలెన్స్ చీఫ్, డైరెక్టర్ (పా) ఎన్‌వీకే శ్రీనివాస్, జీఎం సెక్యూరిటీ రంగనాథ్ దీక్షితులకు ఫిర్యాదు చేశారు. సింగరేణి సెక్యూరిటీ విభాగం ఎస్అండ్‌పీసీకి అనుబంధంగా 2002–2003 సమయంలో విశ్వాస్ యూత్ పేరిట ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో కార్మికుల, పదవీ విరమణ పొందిన కార్మిక కుటుంబాల పిల్లలకు, భూ నిర్వాసితులకు ప్రైవేటు సెక్యూరిటీ ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఆ తర్వాత వివిధ ఏజెన్సీల పేర్లతో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను నియమిస్తున్నారు. ఈ క్రమంలో నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించి, అవినీతి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం మొత్తం 130 పోస్టులకు గాను 149 మంది ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. తాజాగా 15 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి 35 మందిని ఎంపిక చేశారు. దీని వల్ల అభ్యర్థులకు నెలలో 15 రోజులు కూడా డ్యూటీలు దొరికే పరిస్థితి ఉండదని పలువురు పేర్కొంటున్నారు. సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని, అర్హులకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

నిర్వాసితులకే తొలి ప్రాధాన్యం



ఫిట్‌నెస్ టెస్ట్‌లోనే ఎంపికైనవారికే అవకాశం ఇస్తాం. పోస్టుకు రూ. లక్ష వసూలు చేస్తున్నారనే విషయం నా దృష్టికి రాలేదు. సింగరేణి నిర్వాసితులకు, ప్రభావిత ప్రాంతాల, సింగరేణీయుల పిల్లలకు ప్రాధాన్యం ఉంటుంది. సోమవారం ప్రైవేట్ కాంట్రాక్టర్‌ను పిలిచి మాట్లాడుతాం. అర్హులు ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు.

– దుర్గం రాంచందర్, మణుగూరు ఏరియా జీఎం

కిన్నెరసాని వాగు వెలవెల

రంగాపురం చెక్‌డ్యామ్ వద్ద నీరులేక సాగునీటి ఇబ్బందులు



రంగాపురం చెక్ డ్యామ్ వద్ద ఎండిపోయిన కిన్నెరసాని

పాల్వంచరూరల్: గతేడాది వేసవిలో నిండిన నీటితో కళకళాడిన కిన్నెరసాని చెక్‌డ్యామ్ ప్రస్తుతం నీళ్లులేక వెలవెలబోతోంది. పాల్వంచ మండలం రంగాపురం గ్రామ సమీపంలోని కిన్నెరసానివాగులో రూ.12.74 కోట్లతో 2021లో చెక్‌డ్యామ్ నిర్మించారు. అప్పటినుంచి వాగు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల వృద్ధి పెరిగింది. వాగులోని ఇసుకను వెలికి తీయడానికి అవకాశం కూడా ఉండేదికాదు. పాల్వంచ మండలంలోని రంగాపురం, నాగారం, బూర్గంపాడు మండలంలోని పట్టీనగర్, సోంపల్లి గ్రామాల రైతులకు సాగునీటి వనరుగా ఉపయోగపడింది. గత వేసవిలో కూడా నీటితో కళకళలాడింది. ప్రస్తుతం చెక్‌డ్యామ్ వద్ద చుక్కనీరు కూడా లేదు. భూగర్భ జలాలు కూడా అడుగంటుతున్నాయని, వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని పరిసర ప్రాంతాల రైతులు పేర్కొంటున్నారు. గతేడాది జూలై 29న కురిసిన భారీ వర్షాలకు కిన్నెరసాని జలాశయం 12 గేట్లను ఎత్తి వరద నీటిని వదలగా చెక్ డ్యామ్ కొట్టుకుపోయింది. దీంతో వాగుకు ఇరువైపులా యాసంగి సాగు చేసిన పంటలకు నీటి కొరత ఏర్పడిందని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఫైనాన్స్ దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

ఇల్లెందు/అశ్వారావుపేటరూరల్/సుజాతనగర్: పలు ఫైనాన్స్ దుకాణాలు, వడ్డీ వ్యాపారాలు సాగిస్తున్న వ్యక్తుల ఇళ్లలో శనివారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇల్లెందు డీఎస్పీ ఎస్. చంద్రభాను ఆధ్వర్యంలో పట్టణంలో పలు చోట్ల సోదాలు చేశారు. లలిత కళామందిర్ ఏరియాలో నివాసం ఉంటున్న ఓ ఫైనాన్స్ వ్యాపారి ఇంట్లో సోదాలు చేయగా కొన్ని ఖాతా పుస్తకాలు లభ్యం అయ్యాయి. ఆ వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఇదే తరహాలో అనుమతి లేని చిట్టీలు నడుపుతున్న వారి కోసం కూడా సోదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో అనుమతి లేని చిట్టీలు నడిపేవారిపై దాడులు చేస్తున్నట్లు తెలిపారు. అశ్వారావుపేటలో సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్ఐలు శ్రీరాముల శ్రీను, శివరామకృష్ణ పాత ఆంధ్రాబ్యాంక్ వీధి, భద్రాచలం రోడ్‌లోని మూడు ఫైనాన్స్ దుకాణాలతోపాటు, గాంధీబొమ్మ సెంటర్లోని ఓ వ్యాపారి ఇంట్లో దాడులు చేశారు. రికార్డులు, వ్యాపారుల లైసెన్స్‌లను పరిశీలించారు. సుజాతనగర్‌లో ఓ వడ్డీ వ్యాపారి ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించిన సదరు వ్యాపారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పలు పత్రాలు, నాలుగు ద్విచక్ర వాహనాలతోపాటు, కొంత నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

37.23 క్వింటాళ్ల గంజాయి దహనం

55 కేసుల్లో రూ.9.31 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం



దహనం చేసే ముందు గంజాయిని తూకం వేయిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు తదితరులు

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని 13 పోలీసు స్టేషన్లలో నమోదైన 55 కేసుల్లో నిందితుల నుంచి సీజ్ చేసిన రూ.9.31 కోట్ల విలువైన నిషేధిత గంజాయిని శనివారం పోలీసులు దహనం చేశారు. ఎస్పీ రోహిత్ రాజ్ సమక్షంలో డిస్ట్రిక్ట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 3,723 కేజీల గంజాయిని లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రపురం శివారు అటవీ ప్రాంతంలో పర్యావరణ , కాలుష్య నియంత్రణా నిబంధనలను పాటిస్తూ దహనం చేశారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ కోర్టు నుంచి అనుమతి తీసుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ యాక్ట్ నిబంధనల ప్రకారం గంజాయిని దహనం చేశామన్నారు. యువతను ప్రలోభాలకు గురిచేస్తూ గంజాయి మత్తులో దింపేవారిపై చర్యలు తీసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా రహస్య బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. డీఎస్పీలు రెహమాన్, సతీష్‌కుమార్, మల్లయ్య స్వామి, సీఐలు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడి

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండా, కొమ్ముగూడెం గ్రామాల్లో నాటుసారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు, మూడు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు.

ఇల్లు దగ్ధం

దుమ్ముగూడెం : బైరాగులపాడు గ్రామానికి జుంజురి నరసింహకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం రాత్రి దగ్ధమైంది. ప్రాణభయంతో కుటుంబీకులు బయటకు పరుగెత్తగా, సామగ్రి, ఇంట్లో నిర్వహిస్తున్న కిరాణ దుకాణంలోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. నష్టం విలువ తెలియాల్సి ఉంది.

రెండు లారీలు ఢీ

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియా నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు అన్‌లోడ్‌కు వెళ్తున్న రెండు టిప్పర్లు ఢీకొన్న సంఘటన మండలంలోని సాంబాయిగూడెం వద్ద శనివారం జరిగింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఓ స్వల్ప గాయాలు కాగా, స్థానికులు 100 పడకల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా లారీ కేబిన్ మొత్తం పాడైంది. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మధ్యాహ్న భోజన బిల్లులు స్వాహా

పాఠశాలకు డుమ్మాకొడుతున్న ఉపాధ్యాయుడు



తాళం వేసి ఉన్న నాగారం పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ కృష్ణయ్య

గుండాల: ఏడాదికాలంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకుండా ఓ ఉపాధ్యాయుడు బిల్లులు డ్రా చేసుకున్నాడు. పాఠశాల విధులకు డుమ్మా కొడుతున్నాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. శనివారం మండల విద్యాధికారి పెండెకట్ల కృష్ణయ్య మండలంలోని నాగారం పాఠశాలను సందర్శించగా, గ్రామస్తులు సమస్యను వివరించారు. ఉపాధ్యాయుడు నెలకు కనీసం నాలుగు రోజులైనా పాఠశాలకు రావడం లేదని, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచీ మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నట్లు విద్యార్థులు తెలిపారు. కాగా బిల్లులు డ్రా చేసినట్లు రికార్డుల ప్రకారం తెలుస్తోందని, శనివారం కూడా ఉపాధ్యాయుడు పాఠశాలకు రాలేదని, స్కూల్‌కు తాళం వేసి ఉందని ఎంఈఓ తెలిపారు. సదరు ఉపాధ్యాయుడికి పలుమార్లు నోటీసులు అందించినా మార్పు రాలేదని, మరోసారి షోకాజ్ నోటీస్ జారీ చేసి, జిల్లా అధికారులకు సమాచారం అందించామని పేర్కొన్నారు.

అన్నదాత 'భగీరథ' ప్రయత్నం

ట్రాక్టర్‌కు మోటార్లు బిగించి వరి పంటకు చెరువు నీరు



ట్రాక్టర్ ఇంజన్‌కు అమర్చిన నాలుగు మోటార్లు

ములకలపల్లి: కోత దశకు చేరిన వరి పంటకు నీళ్లు అందక కళ్ల ముందే ఎండిపోతుండడంతో రక్షించుకునేందుకు అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. ఇందులో భాగంగా ఓ రైతు వినూత్నంగా ఆలోచించి ఒకే ట్రాక్టర్ ఇంజన్‌కు నాలుగు మోటార్లు అమర్చి తన పొలానికి నీరందిస్తున్నాడు. ములకలపల్లి మండలంలోని పూసుగూడెం జీపీ పరిధి తెల్లవాగు చెరువులో నీరు క్రమేపీ అడుగంటుతోంది. ఉన్న కొద్దిపాటి నీరు తూముల గుండా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో సుమారు 80 ఎకరాల ఆయకట్టు వరి పంట ప్రశ్నార్థకంగా మారగా... గ్రామంలో ఏడెకరాలు సాగు చేసిన తాటిపల్లి చంద్రయ్య సరికొత్త ఆలోచన చేశాడు. ఇతర ప్రాంతానికి చెందిన ఓ రైతు ట్రాక్టర్ ఇంజన్‌కు రెండు మోటార్లు అమర్చి నీళ్లు తోడుతున్న వీడియోను యూ ట్యూబ్‌లో చూసిన ఆయన తన మిత్రులు భూక్యా నంద, నాగరాజుతో కలిసి సొంత ట్రాక్టర్‌కు పుల్లీలు అమర్చి నాలుగు మోటార్లు పనిచేసేలా రూపొందించాడు. ఇందుకోసం రూ.1.35 లక్షలు వెచ్చించగా.. తెల్లవాగు వద్ద ట్రాక్టర్ల ఇంజన్ ఉంచి, నాలుగు మోటార్లు నడిపిస్తూ పైపుల ద్వారా చెరువు నీటిని కాలువలోకి వదిలి.. ఆపై పొలానికి చేరుస్తున్నాడు. దీనిని గమనించిన ఆయకట్టు రైతులు మరికొందరు కూడా తమ పొలాలకు నీళ్లు ఇవ్వాలని కోరగా.. ఎకరాకు రూ.1,600 చొప్పున తీసుకుని వారికి సైతం సహకరిస్తున్నాడు. రోజుకు ఎనిమిది ఎకరాల వరకూ పంట తడిపే వీలుందని చంద్రయ్య తెలిపారు.

వారిద్దరిదీ అసూయ, ద్వేషం

షర్మిల, సునీతపై వైఎస్సార్ సోదరి విమలమ్మ

- వైఎస్సార్ శత్రువుల చేతుల్లో వాళ్లు కీలుబొమ్మలయ్యారు... వైఎస్ కుటుంబ పరువును రోడ్డుకీడుస్తున్నారు
- వైఎస్ ఇంటి ఆడపడుచుల తీరు అన్యాయంగా ఉంది
- వారిద్దరూ నోరుమూసుకోవాలి.. ఇంటి ఆడపడుచుగా నేను చెబుతున్నా
- వివేకానందరెడ్డి హత్యతో అవినాశ్, భాస్కర్‌రెడ్డిలకు సంబంధంలేదు
- హత్య చేసిన దస్తగిరి మాత్రం దర్జాగా తిరుగుతున్నాడు
- అతని మాటలు విని అవినాశ్‌ను వేధిస్తారా
- షర్మిల, సునీత ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలి
- ప్రజలకు మంచిచేసే జగన్ మళ్లీ సీఎం కావాలి
- మీడియాతో వైఎస్సార్ సోదరి విమలమ్మ


వైఎస్ విమలమ్మ

సాక్షి, అమరావతి: 'వైఎస్ కుటుంబ ఆడపడుచులు షర్మిల, సునీత అన్యాయంగా మాట్లాడుతున్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబ గౌరవానికి భంగం కలిగిస్తున్నారు. నేనూ వైఎస్ కుటుంబ ఆడపడుచునే. వివేకానందరెడ్డి అందరికంటే నాకే ఎక్కువ సన్నిహితుడు. ఆ కుటుంబ ఆడపడుచుగా చెబుతున్నా.. మా అన్నయ్య వైఎస్ వివేకానందరెడ్డి హత్యతో ఎంపీ అవినాశ్‌రెడ్డికిగానీ వైఎస్ భాస్క ర్‌రెడ్డికిగానీ ఎలాంటి సంబంధంలేదు'.. అని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి విమలమ్మ విస్పష్టంగా ప్రకటించారు. 'కొంగు పట్టుకుని షర్మిల ఓట్లు అడుగుతున్న వీడియో చూసి చాలా బాధపడ్డాను. వైఎస్ కుటుంబ పరువును ఆమె రోడ్డుకీడుస్తున్నారు. ఆమెలో నాయకత్వ లక్షణాల్లేవు. నిత్యం వైఎస్ అవినాశ్‌ను విమర్శిస్తున్నారు. అతను హత్య చేయడంగానీ చేయించడంగానీ వాళ్లు చూశారా? సీఎం జగన్‌పై కూడా దుష్ప్రచారం చేస్తున్నారు. ఎవరు హత్యచేశారో షర్మిల, సునీతే నిర్ణయించేస్తే ఇక కోర్టులు, జడ్జీలు ఎందుకు?' అని ఆమె సూటిగా ప్రశ్నించారు. విజయవాడలో శనివారం విమలమ్మ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలు కీలక అంశాలపై ఇలా సూటిగా స్పందించారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..

వైఎస్సార్ శత్రువుల చేతుల్లో కీలుబొమ్మలుగా షర్మిల, సునీత..

వైఎస్ రాజశేఖరరెడ్డి శత్రువులంతా ఒక్కటయ్యారు. ఈ తరుణంలో వైఎస్ కుటుంబం అంతా కలిసికట్టుగా ఉండాలి. కానీ, వైఎస్ శత్రువుల చేతుల్లో షర్మిల, సునీత కీలుబొమ్మలయ్యారు. వాళ్లిద్దరి చుట్టూ ప్రస్తుతం వైఎస్ కుటుంబ శత్రువులే ఉన్నారు. షర్మిల, సునీతలకు చెబుతున్నా.. వారు నోరు మూసుకోవాలి. పేద ప్రజలకు మంచి చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూడటం సరికాదు. వారిద్దరూ ఎందుకిలా చేస్తున్నారో అర్థంకావడం లేదు. డబ్బు కోసమో పదవి కోసమే తెలీడం లేదుగానీ అసూయ, ద్వేషంతో వ్యవహరిస్తున్నారు. ఏదో ఆశించే ఇదంతా చేస్తున్నారు. జగన్ సీఎం అయ్యాక బంధువులు ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని దూరం పెట్టారు. వాళ్ల పనులు కావడంలేదనే ఇలా ప్రవర్తిస్తున్నారనిపిస్తోంది. వారికి మంచి చెప్పాలని చూశాను. అప్పటి నుంచి నాతో మాట్లాడటం మానేశారు.

హంతకుడు దస్తగిరి దర్జాగా తిరుగుతున్నాడు..

షర్మిల, సునీత తామేది మాట్లాడినా చెల్లుతుందని అనుకుంటున్నారు. మా ఇంట్లో అమ్మాయిలు ఇలా అన్యాయంగా మాట్లాడుతుంటే బాధ కలుగుతోంది. వివేకానందరెడ్డిని కిరాతకంగా హత్యచేశాను అని చెప్పిన దస్తగిరి మాత్రం బయట దర్జాగా తిరుగుతున్నాడు. అతని మాటలు నమ్మి అవినాష్‌రెడ్డిని విమర్శిస్తారా? ఏ తప్పూ చేయని వైఎస్ భాస్కర్‌రెడ్డి ఏడాదిగా జైల్లో ఉన్నారు. అవినాశ్ బెయిల్ రద్దుచేయాలని షర్మిల, సునీత కోర్టులో కేసులు వేశారు. కానీ, వివేకాను హత్యచేశాను అని చెప్పిన దస్తగిరి బెయిల్‌పై ఉన్నా వారెందుకు పట్టించుకోవడంలేదు? షర్మిల, సునీత ఎన్ని మాటలంటున్నా అవినాశ్ ఒక్క మాటా కూడా అనడంలేదు.

వైఎస్‌కు వివేక ఎలాగో.. జగన్‌కు అవినాశ్ అలా..

వైఎస్ రాజశేఖరరెడ్డి, వివేకానందరెడ్డి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. రాజశేఖరరెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు చూసేవారు. అందుకే పులివెందుల, కడప జిల్లాలో పార్టీ బాధ్యతలను వివేకాకు అప్పగించారు. వారిద్దరిలో ఒకరు ఎంపీగా పోటీచేస్తే మరొకరు ఎమ్మెల్యేగా పోటీచేసేవారు. అలా ఓటమి అన్నది లేకుండా గెలుస్తూ వచ్చారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డికి వివేకానందరెడ్డి ఎలానో ప్రస్తుతం వైఎస్ జగన్‌కు వైఎస్ అవినాశ్ అలా అండగా ఉన్నారు. కానీ, వైఎస్ హఠాన్మరణం తర్వాత మారిన పరిస్థితుల్లో వైఎస్ జగన్ తన తండ్రి ఆశయ సాధన కోసం పార్టీ పెట్టారు. దురదృష్టవశాత్తూ ఆనాడు వివేకానందరెడ్డి కాంగ్రెస్ వైపు ఉండిపోయారు. ఆ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా జగన్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు చూసుకోవాల్సి వచ్చింది. అందుకే పులివెందుల, కడప జిల్లాల్లో పార్టీ బాధ్యతలను చూసుకునేందుకు అవినాశ్‌రెడ్డిని ఎంపిక చేసుకున్నారు. దీంతో అవినాశ్ తనపై పెట్టిన బాధ్యతను ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారు. పులివెందులను, కడప జిల్లాను అభివృద్ధి చేస్తున్నారు. అసలు అవినాశ్‌ను ఎంపీగా గెలిపించాలనే వివేకానందరెడ్డి చివరివరకూ ప్రచారం చేశారు కదా. ఈ విషయాన్ని గుర్తించయినా షర్మిల, సునీత అవినాశ్ మీద దుష్ప్రచారాన్ని మానుకోవాలి. ప్రజలకు మంచి చేస్తున్న జగన్‌కు అండగా నిలవాలి. వారిద్దరూ మరోసారి కూర్చుని చర్చించి జగన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నా. ఎందుకంటే జగన్ శత్రువులంతా ఒక్కటయ్యారు. బయట శత్రువులంతా ఒక్కటైతే కుటుంబం అంతా కలిసికట్టుగా ఉండి ఎదుర్కోవాలి. ఆ కుటుంబ ధర్మాన్ని పాటించాలని షర్మిల, సునీతలకు సూచిస్తున్నా.

జగన్‌ను మళ్లీ సీఎంను చేయండి..

ఇక వైఎస్ రాజశేఖరరెడ్డి కోట్లాది మంది ప్రజల గుండెల్లో దేవుడిగా ఉన్నారు. వైఎస్, వివేకా ఇద్దరూ ఫ్యాక్షన్ రాజకీయాలకు వ్యతిరేకం. మా నాన్నను హత్యచేసిన తరువాత కూడా ఎలాంటి ప్రతీకార రాజకీయాలకు పాల్పడకుండా వారు ఫ్యాక్షన్‌ను అంతంచేశారు. కానీ, ప్రశాంతంగా ఉన్న పులివెందులలో ప్రస్తుతం కొందరు అల్లర్లు రేకెత్తించేందుకు యత్నిస్తుండటం బాధ కలిగిస్తోంది. తండ్రి రాజశేఖరరెడ్డి ఆశయాలను సాధించేందుకు జగన్ ప్రజలకు ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. పేద ప్రజలకు అంత మంచి చేస్తున్న జగన్ మరోసారి సీఎం కావాలి. అందుకోసం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అందరినీ గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.

రైతన్నకు అకాల నష్టం

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వర్షానికి తడిసిన ధాన్యం

నిజామాబాద్/కామారెడ్డి నెట్‌వర్క్: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు కురిసిన అకాల వర్షానికి కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల వర్షపు నీటి ప్రవాహంలో వడ్లు కొట్టుకుపోయాయి. చేతికందిన పంటను అమ్ముకునే సమయంలో వర్షం దెబ్బతీయడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. ఆర్మూరు, ఆలూర్, ఎడపల్లి, వర్ని, చందూర్, మోస్రా, సాలూర, రుద్రూర్, కోటగిరి, పొతంగల్, రెంజల్, మాక్లూర్, డొంకేశ్వర్ మండలాల్లో రైతుల కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద, లింగంపేట, పిట్లం, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో రోడ్లపై ఉన్న ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. ధాన్యం రాశుల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బీర్కూర్ మండల కేంద్రంలో పోలీసుస్టేషన్ సమీపంలో రోడ్లపై ఉన్న ధాన్యం రాశుల మధ్య నీరు భారీగా చేరడంతో మోటార్ల సహాయంతో తొలగించారు. వర్షాలతో అంతటా వరి కోతలకు బ్రేక్ పడింది.

కొనుగోళ్లలో అక్రమాలకు తావులేదు

- ఇప్పటివరకు 1.87 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం..
- పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడి


డీఎస్ చౌహాన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావులేదని.. కొందరు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత నెల 25 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని.. ఇప్పటివరకు 7,149 కేంద్రాల్లో కలిపి 1.87 లక్షల టన్నులు కొన్నా మని వివరించారు. అత్యధికంగా నిజామాబాద్‌లో లక్ష టన్నులు, కామారెడ్డిలో 11 వేల టన్నుల కొనుగోళ్లు జరిగాయన్నారు. రూ.2,350 నుంచి రూ.2,900 ధరతో ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయని.. మద్దతు ధర కంటే ఎక్కువ ధర రైతుల కు అందుతోందని పేర్కొన్నారు. రెండు రోజుల్లోనే రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. మార్కెట్ యార్డులలో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. 75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు టార్గెట్ పెట్టుకున్నామని చెప్పారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తర్వాత విక్రయిస్తే మద్దతు ధర వస్తుందని చెప్పారు.

బకాయిల వసూలుపై ఫోకస్

రైస్ మిల్లర్ల నుంచి బకాయిల వసూలు మొదలు పెట్టామని.. దీంతో కొందరు మిల్లర్లు భయపడి ఇతర దేశాలకు పారిపోయారని డీఎస్ చౌహాన్ చెప్పారు. నిబంధనలు పాటించని మిల్లర్లపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రవాణా బకాయిలు రూ.900 కోట్లను క్లియర్ చేశామన్నారు.

వ్యవసాయ మార్కెట్లలో రైతుల పడిగాపులు

- సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో పోటెత్తిన ధాన్యం
- కొనుగోళ్ల జాప్యంతో అన్నదాతలకు ఇబ్బందులు
- కేసుల నేపథ్యంలో జనగామ మార్కెట్లో కొనుగోళ్లు నిలిపేసిన వ్యాపారులు
- మద్దతు ధరకు కొనుగోలు చేయలేమని స్పష్టీకరణ
- పంటలు తెచ్చిన రైతుల్లో ఆందోళన


తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

తిరుమలగిరి (తుంగతుర్తి)/జనగామ: వానల్లేక, సాగునీరు అందక చాలా చోట్ల వరి పంట దెబ్బతిన్నది. మిగిలిన చోట రైతులు వరికోతలు పూర్తి చేసి.. వ్యవసాయ మార్కెట్లకు తెస్తున్నారు. కానీ మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోళ్లు చేస్తుండటం, అదీ సరిగా సాగకపోవడంతో.. పడిగాపులు పడుతున్నారు. శనివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఇదే పరిస్థితి కనిపించింది.

భారీగా పోటెత్తిన ధాన్యం

శనివారం తిరుమ లగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు 47,660 బస్తాల ధాన్యం వచ్చింది. యాసంగి సీజన్ మొదలై నప్పటి నుంచి ఇంత భారీగా ధాన్యం రావడం ఇదే మొదటిసారి. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా.. వాతావరణంలో మార్పులతో రైతులు యార్డుకే ధాన్యాన్ని తీసుకొస్తున్నారని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచే మార్కెట్‌లోకి ధాన్యం ట్రాక్టర్లను అనుమతించాల్సి ఉండగా.. శనివారం తెల్లవారు జాము వరకు పంపలేదు. దీనితో రోడ్డు పైనే వందలకొద్దీ ట్రాక్టర్లు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కాగా ట్రేడర్లు ధాన్యానికి క్వింటాల్‌కు కనిష్టంగా రూ.1,700, గరిష్టంగా రూ.1,980 ధర చెల్లించారు.

జనగామలో కొనుగోళ్లు నిలిపేసిన ట్రేడర్లు

తక్కువ ధరకు ధాన్యం కొనుగోళ్లపై రైతుల ఆందోళన, ముగ్గురు ట్రేడర్లపై కేసుల నమోదు నేపథ్యంలో.. జనగామ వ్యవసాయ మార్కెట్లో ట్రేడర్లు కొనుగోళ్లు నిలిపివేశారు. దీనితో మార్కెట్‌కు వరి ధాన్యం, మక్కలు, చింతపండు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చిన రైతులు వాటిని అమ్ముకో వడానికి పడిగాపులు పడుతున్నారు. ఇక మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజునాయక్ శనివారం జనగామ మార్కెట్ కార్యాలయంలో.. ట్రేడర్లు, అడ్తిదారులతో రెండు గంటల పాటు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ప్రైవేట్ మార్కెట్‌లోనూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని రాజునాయక్ కోరగా.. అది సాధ్యం కాదని ట్రేడర్లు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లేని నిబంధనలను జనగామ మార్కెట్‌పై ఎందుకు రుద్దుతున్నారని ప్రశ్నించారు. తమపై అన్యాయంగా కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. మరోవైపు ఈ మార్కెట్లో కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభమవుతాయా? అని రైతులు ఎదురు చూస్తున్నారు.

గురుకులంలో 25 మంది విద్యార్థులకు అస్వస్థత


భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని శనివారం 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఆరో తరగతి చదువుతున్న సీహెచ్.ప్రశాంత్, కల్యాణ్ కృష్ణ అనే ఇద్దరు విద్యార్థులు వాంతులు, విరోచనాలతో బాధపడుతుండటంతో హైదరాబాద్‌కు తరలించారు. స్వల్ప అస్వస్థతకు గురైన ఎనిమిది మందికి భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మిగతా 15 మంది విద్యార్థులకు పాఠశాలలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసి చికిత్స అందజేస్తున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

జిల్లా వార్తలు

రాములోరి కల్యాణానికి ముస్తాబు


నేలకొండపల్లి రామదాసు మందిరంలోని ఉత్సవ మూర్తులు

నేలకొండపల్లి: పరమ భక్తాగ్రేసరుడు కంచర్ల గోపన్న(భక్త రామదాసు) జన్మస్థలమైన నేలకొండపల్లిలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 17న శ్రీసీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయాన్ని భద్రాచలం దేవస్థానం దత్తత తీసుకోగా.. శనివారం అధికారులు మందిరం అర్చకుడు సౌమిత్రి రమేష్‌కు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను అందజేశారు. అలాగే, కల్యాణోత్సవం నిర్వహణకు రూ.50వేల వరకు నిధులు కేటాయించినట్లు తెలిసింది. ఇక కల్యాణం నిర్వహించేందుకు భద్రాచలం దేవస్థానం నుంచి నలుగురు వేద పండితులు రానుండగా, స్థానిక భక్తులు గోటి తలంబ్రాలను ఇప్పటికే సిద్ధం చేశారు.

రేపటి నుంచి ఫ్యాక్టరీలో క్రషింగ్

దమ్మపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో సోమవారం నుండి గెలల క్రషింగ్ పునఃప్రారంభం కానుంది. ఈ విషయన్ని ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక మరమ్మత్తుల కారణంగా నెల క్రితం అప్పారావుపేట ఫ్యాక్టరీకి సెలవు ప్రకటించారు. ప్రస్తుతం పనులు పూర్తికావడంతో ఈనెల 15వ తేదీ నుంచి గెలలు స్వీకరిస్తామని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు.

అశ్వారావుపేట ఫ్యాక్టరీలో బ్రేక్

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని అయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ఈనెల 15వ తేదీ నుంచి గెలల క్రషింగ్ నిలిపేస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు. ఫ్యాక్టరీ నిర్వహణ పనులు చేపట్టనున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రైతులు దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీకి గెలలను తరలించాలని కోరారు. కాగా, గెలల దిగుబడి సమయాన నిర్వహణ పనుల పేరుతో క్రషింగ్ నిలిపివేయడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆట మొదలు కాలేదు...!

- క్రీడాకారులకు అందని క్రీడా కిట్లు
- గ్రామపంచాయతీలకే పరిమితం
- ఉమ్మడి జిల్లాకు 1,336 కిట్ల కేటాయింపు
- ఇప్పడైనా వినియోగంలోకి తీసుకురావాలంటున్న యువత


వెంకటేశ్వర కాలనీలో క్రీడాప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు (ఇన్‌సెట్) గౌతంపూర్‌లో అలంకారప్రాయంగా క్రీడాప్రాంగణం

చుంచుపల్లి: క్రీడలపై ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించేలా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.లక్షలు వెచ్చించినా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. సరైన వసతులు కల్పించకపోవడంతో చాలా చోట్ల క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారగా.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పంపిణీ చేసిన క్రీడా సామగ్రి గ్రామపంచాయతీ కార్యాలయాలకే పరిమితం కావడంతో యువత నిరుత్సాహానికి గురవుతున్నారు.

మున్సిపాలిటీలు, గ్రామాల్లో..


గత ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 2022వ సంవత్సరం జూన్ 2న ప్రతీ గ్రామం, పట్టణాల్లో అనువైన స్థలాలు గుర్తించగా.. గ్రామాలు, మున్సిపాలిటీల్లో స్థల లభ్యత, జనాభా ఆధారంగా రెండు నుంచి మూడు ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్ ఆడేలా కోర్టును సిద్ధం యువత, చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి రాలేదు. ఇక ఆరు నెలల క్రితం క్రీడా సామగ్రిని తెలంగాణ క్రీడాశాఖ ద్వారా పంపిణీ చేసింది. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, స్కిప్పింగ్‌తో పాటు పలురకాల పరికరాలను సమకూర్చగా..వీటిని కార్యాలయాలకే పరిమితం చేశారు. ఒక్కొక్కటి రూ.63వేల విలువైన కిట్లను ఖమ్మం జిల్లాకు 606, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 730 సమకూర్చారు. మండల కేంద్రాలు, మున్సిపాలిటీలకు సరఫరా చేయగా అక్కడి నుంచి అధికారులు గ్రామపంచాయతీలకు అప్పగించారు. కానీ గ్రామపంచాయతీ కార్యాలయాలు దాటి క్రీడాప్రాంగణాలకు ఇవి చేరలేదు. ఒక్కో కిట్‌లో జిమ్ పరికరాలతో పాటు క్రికెట్, వాలీబాల్ సామగ్రి ఉంది. క్రికెట్ బ్యాట్లు, గ్లౌజ్‌లు, లెగ్ ప్యాడ్లు, వికెట్లు, బంతులు, వాలీబాల్‌కు సంబంధించి సింథటిక్ బాల్స్, సైకిల్ పంపు, జిమ్ పరికరాల్లో డంబెల్స్, మెసరింగ్ టేప్, డిస్కస్ త్రో, టెన్నికాయిట్ రింగ్స్, స్కిప్పింగ్ తాళ్లు, విజిల్స్, స్టాప్‌వాచ్‌తో పాటు క్రీడాకారులకు టీషర్టులు ఉన్నాయి. అయితే, ఈ కిట్లు ప్రాంగణాలకు చేరక జీపీ కార్యాలయాల్లో పడి ఉండగా.. వేసవి సెలవుల్లో శిక్షణ పొందుతామని భావించిన వారికి నిరాశే ఎదురవుతోంది.

అస్తవ్యస్తంగా ప్రాంగణాలు

గ్రామాల పరిధిలో అర ఎకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వెచ్చించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఆటలు ఆడేలా చదును చేయించడంతో పాటు వాలీబాల్, ఖోఖో కోర్టులు సిద్ధం చేసి సింగిల్, డబుల్‌బార్ కూడా ఏర్పాటుచేశారు. ఉన్నా కానీ చాలా గ్రామాల్లో స్థలాల కొరతతో ఊరికి దూరంగా, శ్మశానవాటికల పక్కన, పాఠశాలల ప్రాంగణాల్లో ఏర్పాటుచేయడంతో ఉపయోగంలోకి రావడం లేదు.ఇక పట్టణాల్లోనూ వార్డుకో క్రీడా ప్రాంగణం ఏర్పాటుచేయాల్సి ఉన్నా స్థలకొరతతో నాలుగైదు వార్డులకు కలిపి ఒకటే ఏర్పాటు చేశారు. ఆతర్వాత సరైన వసతులు కల్పించక.. శిక్షణ ఇచ్చే వారు లేక యువకులు, క్రీడాకారులు రావడానికి ఆసక్తి చూపడం లేదు. అనంతరం నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో చాలాచోట్ల క్రీడా ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి.


జీపీల బాధ్యులకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)


వినియోగంలోకి తీసుకురావాలి..



గత ప్రభుత్వం హడావుడిగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ వసతులు లేక ఆదరణకు నోచుకోవడం లేదు. పంచాయతీ బాధ్యులు పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగాయి. ఇకనైనా క్రీడాకారులకు కిట్లు అందించి ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలి.

– భూక్యా రమేష్, సీపీఎం నాయకుడు

క్రీడా ప్రాంగణాల నిర్వహణపై దృష్టి



గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్వహణ బాధ్యతను పంచాయతీలే చూడాల్సి ఉంటుంది. ఈ విషయమై గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించేలా ఆదేశాలు ఇస్తాం. అలాగే, క్రీడా కిట్లను ఉపయోగంలోకి వినియోగంలోకి తేవాలని సూచిస్తాం.

– వి.చంద్రమౌళి, డీపీఓ, భద్రాద్రి కొత్తగూడెం

ఎన్డీఏను గద్దె దింపడమే ప్రధాన అజెండా

- ఓటమి భయంతోనే ఈడీ, సీబీఐ దాడులు
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు


మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు, పక్కన తమ్మినేని, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ, ఎన్డీఏ కూటమిని గద్దె దించడమే ప్రధాన అజెండాగా లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం, ఇండియా కూటమి ముందుకెళ్తోందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి ఆయన మాట్లాడారు. దేశాన్ని మోదీ ప్రభుత్వం ప్రమాదకరస్థాయికి తీసుకెళ్లిందని, అదే కూటమి మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజ్య స్వభావమే పూర్తిగా మారిపోతుందని తెలిపారు. అందుకే ఎన్నికల్లో ప్రధాన భూమిక పోషించాలని మార్కిస్టు పార్టీ నిర్ణయించిందన్నారు. అయితే, మోడీ, కార్పొరేట్ శక్తులు దేశంలో కృత్రిమ వాతావరణాన్ని సృష్టించాలని ప్రయత్నిస్తున్నాయని, అత్యధిక సీట్లు వస్తాయని అనుకూల కార్పొరేట్ మీడియా సంస్థల ద్వారా ప్రచారం చేయించుకోవడమే కాక ప్రపంచవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు పెరిగాయని చెప్పిస్తున్నా ఇందులో వాస్తవం లేదన్నారు. గెలుస్తామని విశ్వాసం ఉంటే ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, హేమంత్ సోరైన్ లాంటివారిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏమిటని వారు ప్రశ్నించారు. బీజేపీకి ప్రమాదకరంగా ఉన్న వారిపై ఈడీతో దాడులు చేయిస్తోందని విమర్శించారు. కాగా, ఈ దేశంలో ఎన్నికల బాండ్లు తీసుకోని ఏకైక పార్టీ సీపీఎం మాత్రమేనని, నీతి, నిజాయితీ అంటూ మాట్లాడే బీజేపీ మాత్రం అత్యధికంగా బాండ్లు తీసుకుందని ఆరోపించారు. దేశంలో రాజ్యాంగ మౌలిక విలువలను రక్షించుకునేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. కాగా, తెలంగాణలోనూ బీజేపీ ప్రమాదం ముంచుకొస్తోందని, మతోన్మాద వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్రంలో ఒక్క ఎంపీ స్థానం కూడా గెలవకూడదనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇక కాంగ్రెస్‌ను లౌకిక పార్టీగా అంగీకరిస్తున్నామే తప్ప ఆ పార్టీపై మోజేమీ లేదని రాఘవులు చెప్పారు. అయితే, తెలంగాణలో ఆ విజ్ఞత కాంగ్రెస్‌కు లేదని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, ఎర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, బొంతు రాంబాబు, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వర్లు, చింతలచెర్వు కోటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

'అలుపెరుగని పోరాటం' పుస్తకావిష్కరణ

నాటి ఎమర్జెన్సీని మించి నిరంకుశ విధానాలను బీజేపీ అవలంభిస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీ.వీ.రాఘవులు విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సి ఉందని తెలిపారు. ఈమేరకు ప్రబీర్ పుర్కాయస్థ రచించిన 'అలుపెరుగని పోరాటం' పుస్తకాన్ని శనివారం ఆయన ఖమ్మంలో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుతం ఉపా చట్టం కింద జైలు జీవితం గడుపుతున్న ప్రబీర్... ఎంత కష్టాన్నయినా ఓ విప్లవకారుడు ఎలా ఎదుర్కొంటాడో ఈ పుస్తకం ద్వారా పరిచయం చేశారని వివరించారు. కాగా, కాంగ్రెస్, బీజేపీల అధికార మార్పిడి జరిగిందే తప్ప జైళ్లు, నిర్బంధాలు మారలేదని తెలిపారు. రచయిత ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం, సీపీఐ, ఎన్డీ నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, మందుల రాజేంద్రప్రసాద్, విద్యావేత్త రవి మారుత్, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, జేఎన్‌యూ పూర్వ విద్యార్థి నెల్లూరు నరసింహారావు, విజయ్, మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి


మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

మధిర(చింతకాని): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. చింతకాని మండలం నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నాగులవంచ రైల్వే కాలనీ పీఎస్ హెచ్‌ఎం గుండా మధుకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను విడుదల చేయక పోగా తిరిగి వెనక్కి పంపడం సరికాదన్నారు. జీపీఎఫ్, టీఎస్‌జీఎల్‌ఐ, మెడికల్, సరెండర్ లీవ్, పెన్షనర్ల బిల్లులను ఇకనైనా విడుదల చేయాలని కోరారు. అలాగే, ఉద్యోగ విరమణ చేసిన వారికి ప్రయోజనాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఎంఈఓ మోదుగు శ్యాంసన్, టీపీటీఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజు, నాయకులు జీవీబీ.రంగారెడ్డి, విజయ్, మల్లికార్జున్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, పుల్లయ్య, చెన్నకేశవరెడ్డి, జలీల్‌పాషా, శ్రీనివాసరావు, గోవిందరెడ్డి, రత్నకుమారి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలకు రూ.12 లక్షల నిధులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఆదివా రం నిర్వహించనున్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలకు యాజమాన్యం రూ.12.10 లక్షల బడ్జెట్ కేటాయించింది. ఇందులో ఎస్టీపీపీ(సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్, మంచిర్యాల)కు రూ.50 వేలు, హైదరాబాద్ కార్యాలయానికి రూ.35 వేలు, నైనీ కార్యాలయానికి రూ.25 వేలతో పాటు మిగిలిన 11 ఏరియాలకు రూ.లక్ష చొప్పున నిధులు విడుదల చేశారు. ఈమేరకు వేడుకలను ఘనంగా నిర్వహించాలని జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య సూచించారు. ఇటీవల ఆయన వివిధ విభాగాల అధికారులు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో సమావేశమై చర్చించారు.

కాగా, కొత్తగూడెంలోని సింగరేణి ప్రధా న కార్యాలయంలో ఆదివారం డైరెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యాన అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు.